# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 297 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శుక్రవారం 5 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## ఏపీకి ఇచ్చిన 5గ్రామాలు తెలంగాణకే ఇవ్వాలి..

ప్రధాని నరేంద్రమోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

సమావేశంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై చర్చ

తెలంగాణ అభివృద్ధికి సహకారం అందించాలని వినతిపత్రం

హైదరాబాద్ పెన్ పవర్:ఇరు తెలుగు రాష్ట్రాల సీఎంలు ఢిల్లీలో బిజీ బిజీగా గడుపుతున్నారు. బుధవారం రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు గురువారం ఉదయం ప్రధాని మోడీని కలిశారు. ఆ తర్వాత తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రధానిని కలిశారు. ప్రధానితో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీకి ఇచ్చిన భద్రాచలం దగ్గరి 5గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలని ప్రధాని మోడీని, హోం మంత్రి అమిత్ షాను కోరినట్లు తెలిపారు రేవంత్ రెడ్డి. చంద్రబాబుతో భేటీలో కూడా ఈ 5గ్రామాల గురించి చర్చిస్తామని తెలిపారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. జూలై 6న ఏపీ సీఎం చంద్రబాబుతో భేటీ ఉన్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి.



రాష్ట్ర విభజన కారణంగా ఇరు రాష్ట్రాల మధ్య ఏర్పడ్డ సమస్యల గురించి చర్చించేందుకు భేటీ అవుదామని చంద్రబాబు రేవంత్ రెడ్డికి లేఖ రాసిన సంగతి తెలిసిందే. చంద్రబాబు ప్రతిపాదనకు అంగీకరించిన రేవంత్ ఈ నెల 6న ప్రజాభవన్ లో భేటీకి చంద్రబాబును ఆహ్వానించారు. మరి, ఈ భేటీలో 5గ్రామాల సమస్యకు పరిష్కారం లభిస్తుందా లేదా చూడాలి.

## రాహుల్ దిష్టిబొమ్మకు బీజేవైఎం శవయాత్ర... నాంపల్లిలో హైటెన్షన్



రాహుల్ దిష్టిబొమ్మకు బీజేవైఎం శవయాత్ర

గాంధీభవన్ వైపు నిరసన కారుల పరుగులు

అడ్డుకున్న పోలీసులు, పలువురి అరెస్ట్

హైదరాబాద్ పెన్ పవర్: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా పార్లమెంటులో వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీజేవైఎం చేపట్టిన ఆందోళనతో నాంపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి రాహుల్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో దిష్టిబొమ్మ దహనానికి యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులపై లాఠీలు ఝుళిపించారు. రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి సస్పెండ్ చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. బీజేపీ ఆఫీసు

వివరాలు 2లో..

## కేకే ప్రభుత్వ సలహాదారుగా.. కేబినెట్ ర్యాంక్ హెూదా

- రాజకీయ, పాలనాపరమైన అనుభవాలను వినియోగించుకోవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డి
- త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం
- మొన్న ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కె.కేశవరావ

వివరాలు 2లో..



## రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన కె.కేశవరావు



రాజ్యసభ చైర్మన్‌కు రాజీనామా లేఖను సమర్పించిన కేకే

మొన్న కాంగ్రెస్ పార్టీలో చేరిన కేశవరావు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఖర్గే

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ సీనియర్ రాజకీయ నాయకుడు కె.కేశవరావు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు రాజీనామా లేఖను సమర్పించారు. కేశవరావు మొన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వివరాలు 2లో..

## కేశవరావు రాజ్యసభకు రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నాం

కాంగ్రెస్‌లో చేరిన కేకే... రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన వైనం

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల రాజీనామా మాటేమిటని కేటీఆర్ ప్రశ్న

రాజ్యాంగాన్ని మీరు ఎలా నిలబెట్టాలనుకుంటున్నారని ప్రశ్న



వివరాలు 2లో..

## ఢిల్లీలో రేవంత్ ముప్పుతిప్పలు

అధిష్టానం వద్ద రెగ్యులర్ గా పడిగాపులు

సీఎంలను అవమానించడం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది

రాష్ట్రం నలుగురు నడుమ నలిగి పోతోంది

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డిని ముప్పుతిప్పలు పెడుతుందని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్రం నలుగురు నడుమ నలిగి పోతోందని అన్నారు. నాంపల్లిలోని బీజేపీ స్టేట్ ఆఫీస్ లో ఏర్పాటుచేసిన

వివరాలు 2లో..



## నిరుద్యోగులకు ఉద్యోగం రాలేదు కానీ రాహుల్, రేవంత్ రెడ్డిలకు ఆ ఉద్యోగాలు వచ్చాయి

- నిరుద్యోగుల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే వరకు పోరాటం చేస్తామన్న బాల్క సుమన్
- బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులను కాంగ్రెస్ నేతలు రెచ్చగొట్టారని ఆరోపణలు
- ఇప్పుడు నిరుద్యోగులను మోసం చేశారని విమర్శ

వివరాలు 2లో..



## ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు చంద్ర బాబు..

తెలంగాణలో TDP బలోపేతంపై మీటింగ్



- పార్టీ నూతన అధ్యక్షుడి నియామకంపై చర్చ
- స్థానిక సంస్థల్లో పోటీపై చర్చించే చాన్స్
- సభ్యత్వ నమోదు పునరుద్ధరణపైనా నిర్ణయం
- తెలంగాణ లీడర్లకు ఏపీలో నామినేటెడ్ పోస్టులు?

వివరాలు 2లో..

## అధికారం పోయిందని బాధపడటం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదు

ప్రజాస్వామ్యంలో అధికారం లేదా ప్రతిపక్ష పాత్ర శాశ్వతం కాదన్న కేసీఆర్

మనకు ప్రజాతీర్పే శిరోధార్యమని... వారు ఏ పాత్రను అప్పగిస్తే దానిని నిర్వర్తించాలని వ్యాఖ్య

రాజకీయానికి గెలుపోటములతో సంబంధం లేదన్న కేసీఆర్

హైదరాబాద్ పెన్ పవర్: అధికారం కోల్పోయామని బాధపడటం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారం లేదా ప్రతిపక్ష పాత్ర శాశ్వతం కాదన్నారు. ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ, నర్సాపూర్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆయన ఫామ్ హౌస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మనకు ప్రజా తీర్పే శిరోధార్యమన్నారు. వారు ఏ పాత్రను అప్పగిస్తే దానిని చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు.ప్రజా సంక్షేమం కోసం కొనసాగే నిరంతర ప్రక్రియనే రాజకీయం అన్నారు.



వివరాలు 2లో..

## ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన హేమంత్ సోరెన్

భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరెన్ ను అరెస్ట్ చేసిన ఈడీ

సోరెన్ పై మనీలాండరింగ్ ఆరోపణలు

ఇటీవల బెయిల్ పై విడుదలైన హేమంత్

ఝార్ఖండ్ సీఎం పదవికి రాజీనామా చేసిన చంపయీ సోరెన్

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ హేమంత్ సోరెన్ ను ఆహ్వానించిన గవర్నర్

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:ఇటీవల బెయిల్ పై విడుదలైన హేమంత్ సోరెన్ నేడు ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఐదు నెలల తర్వాత మళ్లీ ఝార్ఖండ్ ముఖ్యమంత్రి పీఠాన్ని సోరెన్ అధిష్ఠించారు. రాంచీలోని రాజ్ భవన్ లో హేమంత్ తో గవర్నర్ రాధాకృష్ణన్ ప్రమాణం చేయించారు. 8.5 ఎకరాల భూమికి సంబంధించిన కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయిన సోరెన్ 5 నెలల పాటు జైల్లో గడిపారు. ఆయనకు ఇటీవలే న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కాగా, హేమంత్ సోరెన్ జైల్లో ఉన్న సమయంలో చంపయీ సోరెన్ ఝూర?ండ్ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

## సంపాదకీయం

# జీవితమే ప్రయాణం

టు గైన్ నాలెడ్జ్ ఆన్ బుద్ధిజం కొన్ని వందల సంవత్సరాల క్రితం హుయాన్ త్సంగ్ అనే వ్యక్తి ఇండియాకు వద్దాం అనుకున్నాడు. దానికి చైనా పర్మిషన్ ఇవ్వలేదు, అయినా సరే అతను ఆగకుండా గోబీ ఎడారి దాటి సెంట్రల్ ఏసియాలో కషగర్,సమర?ండ్ దాటి ఆఫ్ఘనిస్తాన్ చేరుకున్నాడు. ఆ తరువాత పెషవర్ మీదుగా తక్షశిల వచ్చి అక్కడ ఉన్న బుద్ధిష్ట్ మంక్స్ నీ కలిశాడు. బౌద్ధ సోపాలు మొనాస్టరీస్ ని విజిట్ చేశాడు.కాశ్మీర్,మథుర, అయోధ్య కాకుండా దక్షిణ భారతదేశం కూడా వచ్చాడు. అన్ని రాజ్యాలు తిరిగాడు. నలంద యూనివర్సిటీలో 5 ఏళ్ల పాటు జ్ఞానం సంపాదించుకున్నాడు. ఇలా 14 ఏళ్ళు ఇండియాలో ఉండి తిరిగి చైనా వెళ్తే అప్పుడు చైనా ప్రభుత్వం సాల్వా కప్పి సత్కరించింది. జర్నీ ఇస్ యాన్ ఇన్స్పిరేషన్. మరి అదే చైనా నుంచి ఫ్లైట్లో చాలామంది ఇండియా కి చైనీస్ వస్తారు. వాళ్ల గురించి మనం ఎందుకు మాట్లుకోం? వాస్కోడిగామా గురించి ఎందుకు మాట్లాడతాం? మనకి కొలంబస్ నే ఎందుకు గుర్తుంటాడు? బికాస్ ఆఫ్ దేర్ ట్రావెల్! వాళ్లంతా లైఫ్ లో ప్రయాణం చేశారు. మనకి లైఫ్ లో ఫ్రీగా ఏది రాకూడదు, వచ్చినా తీసుకోకూడదు, సంపాదించుకోవాలి దానికోసం కష్టపడాలి. ఎధైనా మనకు సులభం గా వఛిందంటె దాని విలువ మనకు తెలియదు... అందుకే మనం ఒక గోల్ పెట్టుకుంటే ఒక పాత్ రెడీ అవుతుంది. ఆ పాత్ లో నడుచుకుంటూ వెళ్ళటమే ప్రయాణం ముఖ్య ఉద్దేశం. నువ్వు నీ ఫ్రెండు కలిసి ఎవరెస్ట్ ఎక్కుదాం అనుకున్నారు ట్రైన్ లో ఢిల్లీ వెళ్లారు, ట్రిక్కింగ్ కావాల్సినవన్నీ కొనుక్కున్నారు. చాలా ఎక్సైటింగ్ గా ఉంది. అక్కడ నుండి నేపాల్ వెళ్లి మెల్లగా బేస్ క్యాంప్ కి చేరుకున్నారు. విపరీతమైన చలి క్యాంప్ ఫైర్ దగ్గర చలికాచుకుంటూ అక్కడ ఉన్న షేర్ పాస్ తో మాట్లాడుకుంటున్నారు. మరుసటి రోజు ప్రయాణం మొదలుపెట్టారు. లోయలు, వ్యాలీస్ దాటుకుంటూ వెళ్లారు. కొండపైన మంచును గొయ్యిలా తవ్వి ఆ మంచు గుహలో ఆ రాత్రి పడుకుంటే? ఎంతో వెచ్చగా ఉంది. ఒక కప్పు వేడివేడి నూడిల్స్ తింటే ఇంకా బాగుంది. ఫైనల్ గా ఎవరెస్ట్ దగ్గరికి వచ్చారు. విపరీతమైన గాలి, అక్కడనుండి అక్కడం ఇంకా కష్టమైపోయింది. కష్టపడి నీ ఫ్రెండ్ ఎలాగోలాగా ఎవరెస్ట్ ఎత్తుగలిగాడు. నువ్వు 100 అడుగుల కింద ఉండిపోయావు, ఆరోజు వాడొక్కడే ఎవరెస్టు మీద ఉన్నాడు. వాడు మాత్రం అక్కడ ఎంత సేపు ఉంటాడు కాసేపట్లో మళ్ళీ నీ దగ్గరికి వస్తాడు. రారా మామ అని ఇద్దరు కలిసి ఇంటికి పోతారు. మిత్రులు ఇద్దరిదీ జర్నీ మళ్ళీ స్టార్ట్ అవుతుంది. లైఫ్ లో ఎంత సక్సెస్ వచ్చినా ఎవరెస్ట్ మీద ఎవరు ఎక్కువ సేపు ఉండలేరు... అందుకే ఫెయిల్ అయ్యామని ఎప్పుడు బాధపడొద్దు ఒక్కోసారి మన గోల్ రీచ్ అవ్వచ్చు అవ్వకపోవచ్చు... కొంపలు ఏవి మునిగిపోవు.. అందరం ఎక్కువ కాలం గడిపేది ప్రయాణం లోనే... సక్సెస్ లో కాదు...

లెట్స్ ఎంజాయ్ అవర్ జర్నీ

# నిరుద్యోగులకు ఉద్యోగం రాలేదు కానీ రాహుల్, రేవంత్ రెడ్డిలకు ఆ ఉద్యోగాలు వచ్చాయి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగం రాలేదు కానీ... రాహుల్ గాంధీకి ప్రతిపక్ష నేతగా, రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా ఉద్యోగాలు మాత్రం వచ్చాయని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. తెలంగాణలో నిరుద్యోగుల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం మాడి మసైపోవడం ఖాయమని శాపనార్థాలు పెట్టారు. నిరుద్యోగుల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... నిరుద్యోగుల మద్దతుతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ ఇప్పుడు నిండా ముంచుతోందన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్ని యూనివర్సిటీలలో, అశోక్ నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ నిరుద్యోగులను రెచ్చగొట్టి నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఉద్యోగాల భర్తీ చేపడుతామని మాటిచ్చి మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. గ్రూప్స్ విషయంలో హామీని నిలబెట్టుకోలేదన్నారు. 25 వేలతో మెగా డీఎస్సీ వేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పి రెచ్చగొట్టారని... అధికారంలోకి వచ్చాక 5 వేలకు మరికొన్ని కలిపి మమ అనిపించారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం... ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఖర్గే, ప్రియాంక గాంధీలతో చెప్పించారని గుర్తు చేశారు. కానీ ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు లేవన్నారు. నిరుద్యోగులు నిరాహార దీక్షలు చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులపై లాఠీఛార్జ్, అరెస్టులు, కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కోచింగ్ నిర్వాహకులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగుల వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లను కూడా బెదిరిస్తున్నారన్నారు. నిరుద్యోగులను ఉపయోగించుకొని పబ్బం గడుపుకుని ఇప్పుడు వారి జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా బీఆర్ఎస్ హయాంలో 32 వేల ఉద్యోగాల భర్తీకి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఆగిపోయాయన్నారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లడం మానివేసి... పాలనపై దృష్టి సారించాలన్నారు. నిరుద్యోగుల హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అదే నిరుద్యోగులు నిలువునా చీరేస్తారని హెచ్చరించారు.

# కేకే ప్రభుత్వ సలహాదారుగా.. కేబినెట్ ర్యాంక్ హోదా

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ సీనియర్ నేత కె.కేశవరావును ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. కేకేకు ఉన్న రాజకీయ, పరిపాలనపరమైన అనుభవాలను వినియోగించుకోవడానికి సలహాదారుగా నియమించాలని భావిస్తున్నారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. బీఆర్ఎస్ పార్టీని వీడిన కేకే నిన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. బీఆర్ఎస్ ద్వారా తనకు వచ్చిన రాజ్యసభ పదవికి ఆయన ఇవాళ రాజీనామా చేశారు. అనంతరం కేకే మాట్లాడుతూ... తాను కాంగ్రెస్ మనిషిని అన్నారు. కాంగ్రెస్ తనకు సొంతిల్లు వంటిదని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై మాట్లాడుతూ... ఆరు నెలల్లో ఎవరినీ అంచనా వేయలేమన్నారు. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడిగా ఉన్నందువల్ల నైతిక విలువలతో రాజీనామా చేసినట్లు చెప్పారు. రాజ్యసభ చైర్మన్‌కూ ఇదే విషయం చెప్పానని వెల్లడించారు. కాంగ్రెస్ ఎంపీలతోనే తెలంగాణ వచ్చిందన్నారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు చంద్ర బాబు..

**హైదరాబాద్ పెన్ పవర్:**టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 7న ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు రానున్నారు. ఉదయం 11 గంటలకు పార్టీ ముఖ్యనేతలతో కీలక సమావేశం ఏర్పాటు చేసినట్టు సమాచారం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజీనామా చేయడంతో తాత్కాలిక అధ్యక్షుడిగా బక్కని నర్సింహులును నియమించారు. ప్రస్తుతం ఆయన తాత్కలిక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పాతనగరంలోని పురానా పూల్ ప్రాంతానికి చెందిన మరో కీలక నేత అరవింద్ కుమార్ గౌడ్ టీడీపీలోనే కొనసాగుతున్నారు. మాజీ హోం మంత్రి దేవేందర్ గౌడ్ కు మేనల్లుడైన అరవింద్ కుమార్ గౌడ్ టీడీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇలా పలువురు నేతలు ఇప్పటికీ టీడీపీలోనే కొనసాగుతున్నారు. వీళ్లంతా ఆదివారం రోజున జరిగే కీలక సమావేశానికి హాజరవుతారని సమాచారం. ఈ సమావేశంలో పార్టీకి నూతన అధ్యక్షుడిని నియమించే అంశంపై కీలకంగా చర్చిస్తారని తెలుస్తోంది. దీంతో పాటు జిల్లాల వారీగా ఇన్ చార్జీలు ఎవరనే అంశంపైనా ప్రాథమికంగా చర్చించడంతోపాటు పార్టీ సభ్యత్వ నమోదుపైనా డిస్కస్ చేస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ అంశంపైనా చర్చ జరుగుతుందని చెబుతున్నారు. గతంలో టీడీపీలో పనిచేసి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్న నేతలను ముందుగా యాక్టివ్ అవుతారనే టాక్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా పాత నేతలకు సంబంధించిన జాబితాను ట్రస్ట్ భవన్ వర్గాలు ఇప్పటికే సిద్ధం చేసినట్టు సమాచారం.

**టీటీడీపీ లీడర్లకు నామినేటెడ్ పోస్టులు**

తెలంగాణ టీడీపీ నాయకులకు ఏపీలో నామినేటెడ్ పోస్టులు కేటాయించే అవకాశం ఉంది. ముఖ్యంగా టీటీడీ బోర్డు మెంబర్లుగా అవకాశం కల్పించవచ్చని సమాచారం. ఇందులో భాగంగా అరవింద్ కుమార్ గౌడ్ కు అవకాశం లభించవచ్చని టీడీపీ నాయకులు చెబుతున్నారు. మిగతా వారికీ ఈ సారి చాన్స్ దక్కవచ్చని తెలుస్తోంది. జగన్ ప్రభుత్వంలో చాలా పోస్టులు తెలంగాణ వారికి లభించాయి. ప్రస్తుతం కూడా టీటీడీపీ నాయకులకు ఏమైనా నామినేటెడ్ పోస్టులు గానీ, సలహాదారులాంటి పదవులు కానీ ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# కేశవరావు రాజ్యసభకు రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నాం

**హైదరాబాద్ పెన్ పవర్:**తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కె.కేశవరావు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అయితే బీఆర్ఎస్ టిక్కెట్‌పై పోటీ చేసి కాంగ్రెస్‌లో చేరిన పలువురు ఎమ్మెల్యేల సంగతి ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టిక్కెట్‌పై గెలిచిన దాదాపు అరడజను మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారన్నారు. కేకే రాజీనామా చేయడం స్వాగతించదగ్గదేనని... మరి ఎమ్మెల్యేల సంగతి ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని నిలబెడదామని రాహుల్ గాంధీ చెబుతున్నారని... కానీ ఇలా రాజ్యాంగాన్ని నిలబెడతారా? అని నిలదీశారు.సార్వత్రిక

ఎన్నికల సమయంలో ఫిరాయింపులకు అవకాశం లేకుండా పదో షెడ్యూల్‌ను సవరిస్తామని కాంగ్రెస్, రాహుల్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మరి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా మీరు దేశానికి ఏం సందేశం ఇస్తున్నట్లు? ఈ దేశం మిమ్మల్ని ఎలా విశ్వసిస్తుంది? అని ప్రశ్నించారు. మీరు చెప్పినట్లుగా ఇది 'న్యాయ పత్రం' ఎలా అవుతుందో చెప్పాలన్నారు.

# ఢిల్లీలో రేవంత్ ముప్పుతిప్పలు

- మొదటి పేజీ తరువాయి

ప్రెస్ మీట్ లో ప్రభాకర్?మాట్లాడారు. 'రాష్ట్రాన్ని పాలిస్తున్నది రేవంత్ రెడ్డా.. కాంగ్రెస్ అధిష్టానమా? ఆయన ఢిల్లీ వెళ్లడం పరిపాటి అయ్యింది. అక్కడ హైకమాండ్?వద్ద పడిగాపులు కాయడం కూడా రెగ్యులర్ గా జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణ కోసం ఇన్నిసార్లు అనుమతి కోరాలా? సీఎంలను అవమానించడం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది. దీపాదాస్ మున్షీ రాజ్యాంగేతర శక్తిగా మారారు. ముందటి కాళ్లకు బంధం వేసి సీఎంను స్వేచ్ఛగా పనిచేసుకోనివ్వడం లేదు. రేవంత్ చేసిన ప్రతి ప్రకటనపై కాంగ్రెస్ అధిష్టానం అడ్డు పడుతోంది. రాష్ట్రం రేవంత్ రెడ్డికి, మున్షీ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ల మధ్య నలుగుతోంది. పాలనా పరమైన విషయంలో మూడడుగులు ముందుకు ఆరడుగులు వెనక్కి వెళ్తోంది. రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఓ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే మంచిది. చంద్రబాబు, రేవంత్?కలిస్తే మంచేదే. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి ఉందా? ఈ సమావేశం చివరికి ఏదో ఒక కారణంతో ఆగిపోతుంది ' అని అన్నారు.

# అధికారం పోయిందని బాధపడటం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదు

- మొదటి పేజీ తరువాయి


దానికి గెలుపోటములతో సంబంధం ఉండదని హితబోధ చేశారు. ప్రజల్లో కలిసి ఉంటూ వారి సమస్యలమీద నిరంతరం పోరాడుతూ వారి అభిమానాన్ని సాధించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన సాగునీరు, తాగునీరు, నిరంతర విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, సీఎంఆర్ఎఫ్ వంటి అనేక పథకాలను కూడా నేటి కాంగ్రెస్ కొనసాగించకపోవడంతో తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోతోందని అవేదన వ్యక్తం చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ సంపూర్ణ అభివృద్ధి సాధించడమే బీఆర్ఎస్ అంతిమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. గెలుపోటములకు అతీతంగా నిరంతర కృషి కొనసాగించడమే మన కర్తవ్యమన్నారు. అన్నివర్గాలను కడుపులో పెట్టుకొని తెలంగాణను బాగు చేస్తున్న మన పాలన పోతుందని ఎవరూ అనుకోలేదన్నారు. జరిగిన పొరపాటుకు తెలంగాణ సమాజం బాధపడుతోందన్నారు. ఎన్నికల ఫలితాలతో దేశ రైతాంగం బాధపడిందన్నారు. కేసీఆర్ పాలన లేకపోవడంతో తెలంగాణ రైతుల కంటే మహారాష్ట్రతో పాటు దేశ రైతాంగమే తీవ్రంగా నష్టపోయిందన్నారు.

# రాధాకిషన్ రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు

**పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**జుబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్ట్**

**ఓ ల్యాండ్ వ్యవహారంలో వ్యాపారవేత్తను బెదిరించాడని కేసు**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు రాధాకిషన్ రావును పోలీసులు అదుపులోకీ తీసుకున్నారు. చంచల్‌గూడ జైల్లో ఉన్న ఆయనను పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకుని, నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి రాధాకిషన్ రావును అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఓ ల్యాండ్ వ్యవహారంలో వ్యాపారవేత్తను బెదిరించినందుకు ఆయనపై జుబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఓ కంపెనీ వ్యవహారంలో రాధాకిషన్ రావు జోక్యం చేసుకొని సెటిల్మెంట్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. రూ.150 కోట్ల విలువైన కంపెనీని తక్కువ ధరకు మరొకరికి ఇప్పించినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

# రాహుల్ దిష్టిబొమ్మకు బీజేవైఎం శవయాత్ర... నాంపల్లిలో హైటెన్షన్

- మొదటి పేజీ తరువాయి

వద్ద నుంచి గాంధీభవన్ వైపు పరుగులు తీస్తున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. పలువురు ఆందోళనకారులను అరెస్ట్ చేసి వారిని గోశామహల్ స్టేడియానికి తరలించారు.

# రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన కె.కేశవరావు

- మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ, తదితరుల సమక్షంలో ఆయన కొన్నేళ్ల తర్వాత కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చారు. 2013లో కాంగ్రెస్ పార్టీని వీడిన ఆయన... తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

# అది అయిపోగానే మా యాక్షన్ ప్లాన్ మొదలుపెడతాం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ టీడీపీ కూటమి ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన కూటమి నేతలు ప్రస్తుతం హనీమూన్‌లో ఉన్నారని, వారి హనీమూన్ అయిపోగానే తమ యాక్షన్ ప్లాన్ మొదలుపెడతామన్నారు.

ఇక అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఊహించని విధంగా పరాజయం పాలైందన్న అమర్నాథ్.. దానికి గల కారణాలను విశ్లేషించుకుంటున్నామని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలతో తమ ప్రభుత్వం మంచి పాలన అందించిందన్నారు. అయినా ప్రజలు తిరస్కరించారని వాపోయారు.

వాలంటీర్ల వల్ల ప్రజలకు మేలు జరిగినప్పటికీ, పార్టీ మాత్రం నష్టపోయిందన్నారు. ఎన్నికల్లో ఓటమి చెందిన నేతలందరూ వాలంటీర్లపై ఇదే అభిప్రాయంతో ఉన్నారని చెప్పుకొచ్చారు.

# ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన హేమంత్ సోరెన్

- మొదటి పేజీ తరువాయి

హేమంత్ జైలు నుంచి విడుదలైన నేపథ్యంలో, అధికార జేఎంఎం ఎమ్మెల్యేలు చంపయీ సోరెన్ నివాసంలో సమావేశమయ్యారు. హేమంత్ ను తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. చంపయీ సోరెన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా, హేమంత్ సోరెన్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ రాధాకృష్ణన్ ఆహ్వానించారు. వాస్తవానికి జులై 7న ప్రమాణ స్వీకారం చేయాలని హేమంత్ భావించారు. అనూహ్య రీతిలో ఈ మధ్యాహ్నమే ప్రమాణ స్వీకారం చేశారు.

# టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో మరోసారి ఉద్యోగాల కోత

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగాల కోత (లేఆఫ్స్)ను ప్రకటించింది. వివిధ ప్రాంతాల్లో పని చేస్తోన్న పలు టీమ్‌లకు చెందిన వారిని తొలగించినట్లు గ్రీన్ వైర్ అనే మీడియా సంస్థ తెలిపింది. అయితే ఎంతమందిని ఉద్యోగం నుంచి తొలగించిందో వెల్లడించలేదు. వివరాలు వెల్లడించేందుకు కంపెనీ నిరాకరించినట్లు పేర్కొంది. ఉద్యోగం పోయిన పలువురు లింక్డిన్ వేదికగా పోస్టులు పెడుతుండటాన్ని బట్టి చూస్తే.. ప్రోడక్ట్, ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ విభాగాల్లో తొలగింపులు చోటు చేసుకున్నట్లుగా అర్థమవుతోందని పేర్కొంది. గత ఏడాదిలో మైక్రోసాఫ్ట్‌లో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.32 లక్షల నుంచి 2.27 లక్షలకు తగ్గింది. వ్యాపార నిర్వహణలో సంస్థాగత, శ్రామిక శక్తిలో మార్పులు సాధారణమేనని మైక్రోసాఫ్ట్ అధికార ప్రతినిధి తెలిపారు. కస్టమర్లు, భాగస్వాములకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వృద్ధికి ఆస్కారం ఉన్న విభాగాలపై వ్యూహాత్మకంగా పెట్టుబడులు కొనసాగిస్తుందన్నారు.

# భూమ్మీద మనుషులుండే మారుమూల దీవి ఇదే..

**అట్లాంటిక్ మహా సముద్రం మధ్యలో ఉన్న దీవి**

**300 మంది లోపే జనాభా.. అంతా బ్రిటన్ సంతతి వారే..**

**ఈ దీవికి దగ్గరిలోని కేప్ టౌన్ కు దూరమే ఏకంగా 2,787 కిలోమీటర్లు.**




కొందరు ఎక్కడో ఏ అడవిలోనో, ఎడారిలోనో చిక్కుకుపోతుంటారు. చుట్టూ మనుషులు కనబడక ఆందోళన పడుతుంటారు. మరి ఎక్కడైనా సుదూరంగా ఒకేచోట ఉండిపోయి.. మరో ఊరికి వెళ్లేందుకు వేల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తే ఎలా ఉంటుంది? అలాంటి ఓ ప్రాంతమే 'ట్రిస్టాన్ ద కున్హా'. ప్రపంచంలో మనుషులు నివసించే ప్రాంతాల్లో అత్యంత దూరంగా ఉన్న దీవి ఇదే.

అటు దక్షిణ అమెరికా ఖండానికి, ఇటు ఆఫ్రికా ఖండానికి దాదాపు మధ్యలో ఉండే దీవి 'ట్రిస్టాన్ ద కున్హా'. ఇది బ్రిటన్ దేశం అధీనంలో ఉంది. ఇక్కడున్న ఒకే ఒక్క టౌన్ పేరు 'ఎడిన్ బర్గ్ ఆఫ్ సెవెన్ సీస్'. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ల్యాండ్‌శాట్ ఉపగ్రహం ఇటీవల ఈ దీవిని ఫొటో తీసింది. నాసా తమ 'నాసాఎర్త్' పేరిట ఉన్న ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో ఈ ఫొటోను పోస్ట్ చేసింది.

**మంచు, పచ్చదనం మధ్య..**

207 చదరపు కిలోమీటర్ల వైశాల్యమున్న 'ట్రిస్టాన్ ద కున్హా' దీవిలో చాలా భాగం పెద్ద పర్వతమే. దాని శిఖరం కూడా మంచుతో కప్పి ఉంటుంది. మిగతా దీవి అంతా దట్టమైన అడవులతో పచ్చదనం నిండి ఉంటుంది.

ఇక్కడ జనాభా 300 మంది కంటే తక్కువే. అంతా బ్రిటన్ సంతతి వారే నివసిస్తూ ఉంటారు. దీనికి దగ్గరగా కొన్ని దీవులున్నా.. అవేవీ మనుషులు నివసిస్తున్న ప్రాంతాలు కాదు.

మిగతా ప్రపంచంతో కలవాలంటే వేల కిలోమీటర్లు సముద్రంలో ప్రయాణం చేయాల్సిందే.

ట్రిస్టాన్ దీవికి మనుషులు నివసించే దగ్గరి ప్రాంతం దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ నగరం. దాని దూరం కూడా ఏకంగా 2,787 కిలోమీటర్లు.

అందుకే ప్రపంచంలో మనుషులు నివాసం ఉన్న అత్యంత మారుమూల ప్రాంతంగా ట్రిస్టాన్ ను చెబుతారు.

## టాలీవుడ్‌కు సీఎం రేవంత్ రెడ్డి 'షరతు'పై స్పందించిన దిల్ రాజు!

**డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వానికి అండగా ఉంటామన్న టీఎఫ్‌సీసీ**

**ఇలాంటి అంశాల్లో చిత్ర పరిశ్రమ గతంలో ముందుండి నడిపించిందని వెల్లడి**

**త్వరలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తామన్న టీఎఫ్‌సీసీ**



డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు వ్యతిరేకంగా టాలీవుడ్ అవగాహన వీడియోలు తీయాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి షరతుపై తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి (టీఎఫ్‌సీసీ) స్పందించింది. డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు తమ వంతు బాధ్యతగా ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు దిల్ రాజు, కార్యదర్శులు దామోదర ప్రసాద్, కే శివప్రసాదరావు వెల్లడించారు. ఈ మేరకు వారు పత్రికా ప్రకటన చేశారు. రేవంత్ రెడ్డిని కలిసినప్పుడు సినీ పరిశ్రమకు సంబంధించిన అంశాలపై సానుకూలంగా స్పందించారని గుర్తు చేసుకున్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై సినీ రంగ ప్రముఖులు, సినిమా థియేటర్ యాజమాన్యాలు తమ వంతుగా కృషి చేయాల్సిందే అన్నారు. ఇలాంటి అంశాల్లో చిత్ర పరిశ్రమ గతంలోనూ ముందుండి నడిపించిందని తెలిపారు. పరిశ్రమకు చెందిన వారంతా డ్రగ్స్, సైబర్ నేరాలు అరికట్టే విషయంలో తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తాయని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. ఇందుకు సంబంధించి త్వరలో సీఎంను కలుస్తామని తెలిపారు.

## పెద్దిరెడ్డి కుటుంబంపై విజిలెన్స్ డీజీకి ఫిర్యాదు చేసిన టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి



తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీకి ఫిర్యాదు చేశారు. మంగంపేట ముగ్గురాయి గనుల అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. ముగ్గురాయి గనుల్లో రూ.2 వేల కోట్ల మేర దోపిడీ చేశారని తెలిపారు. ఏంప్రెడా కంపెనీ ముసుగులో పెద్దిరెడ్డి కుటుంబం భారీ దోపిడీకి పాల్పడిందని భూమిరెడ్డి ఆరోపించారు. మాజీ ఎండీ వెంకట్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి అక్రమార్కులకు అండగా నిలిచారని వివరించారు.

## కరకట్టపై ప్రభుత్వ ఫైళ్ల దహనం ఘటనపై... ఆరా తీసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**కృష్ణానది కరకట్టపై గతరాత్రి బస్తాల కొద్దీ ఫైళ్ల దహనం**

**ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కు సమాచారం అందించిన టీడీపీ కార్యకర్త**

**బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్న పవన్ కల్యాణ్**



అమరావతిలో కృష్ణా నది కరకట్టపై ప్రభుత్వ ఫైళ్లు దహనం చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. నిన్న రాత్రి AP16 EF 2596 నెంబరు గల ఇన్నోవా వాహనంలో కరకట్టపైకి వచ్చిన వ్యక్తులు... బస్తాల కొద్దీ ఫైళ్లను తగులబెట్టారు.ఇది గమనించిన ఓ టీడీపీ కార్యకర్త ఈ విషయాన్ని వెంటనే పెనమలూరు టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఇతర టీడీపీ నేతలకు తెలియజేశాడు. ఆ ఫైళ్లపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ చైర్మన్ సమీర్ శర్మ ఫొటోలు ఉండడంతో ఈ విషయాన్ని టీడీపీ నేతలు సీరియస్ గా తీసుకున్నారు.

తాజాగా ఈ అంశంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ఈ ఘటన వెనుక ఎవరు ఉన్నారన్న విషయంపై వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. ద దహనం చేసిన ఫైళ్ల వివరాలను వెంటనే తనకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఫైళ్లను దహనం వెనుక ఉన్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు.

## మదుపరుల లాభాల స్వీకరణ... ఫ్లాట్ గా ముగిసిన స్టాక్ మార్కెట్

**ఫ్లాట్ గా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ**

**ట్రేడింగ్ ప్రారంభంలో సరికొత్త గరిష్ఠాల నమోదు**

**క్రమంగా నెమ్మదించిన సూచీలు**



భారత స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్ గా ముగిశాయి. ఉదయం ట్రేడింగ్ ఆరంభంలో సరికొత్త గరిష్ఠాలను అందుకున్న సెన్సెక్స్, నిఫ్టీ... సాయంత్రం నాటికి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 62.88 పాయింట్ల వృద్ధితో 80,049.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 15.65 పాయింట్ల వృద్ధితో 24,302.15 వద్ద స్థిరపడింది. ఉదయం సెషన్ లో సెన్సెక్స్ 80,392 వద్ద సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. అక్కడ్నించి మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఫ్లాట్ గా ముగిసింది. నిఫ్టీలోనూ ఇదే ఒరవడి కనిపించింది. అయినప్పటికీ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ కూడా లాభాలతోనే ముగిశాయి. ట్రేడింగ్ లో సన్ ఫార్మా, టాటా మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్ సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్ షేర్లు లాభాలు అందుకోగా... ఎల్ అండ్ టీ, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి.

## హత్రాస్ తొక్కిసలాట కేసులో ఆరుగురి అరెస్ట్... పరారీలో భోలే బాబా

**హత్రాస్ ఘటనలో 121 మంది మృతి చెందినట్లు తెలిపిన పోలీసులు**

**మృతుల్లో 112 మంది మహిళలు, ఏడుగురు పిల్లలు, ఇద్దరు పురుషులు**

**72 గంటల్లో నిందితుల్లో ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడి**



హత్రాస్ తొక్కిసలాట కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఉత్తరప్రదేశ్ పోలీసులు తెలిపారు. గురువారం అలీఘర్ ఐజీ శలబ్ మాథూర్ మీడియా సమావేశం నిర్వహించి, కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ ఘటనలో 121 మంది భక్తులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుల్లో ఇద్దరు పురుషులు, 112 మంది మహిళలు, ఆరుగురు బాలురు, ఒక బాలిక ఉన్నట్లు చెప్పారు. ఘటన జరిగిన 72 గంటల్లో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఇద్దరు నిర్వాహకులను కూడా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలోని 121 మృతదేహాలను గుర్తించినట్లు చెప్పారు. పోస్ట్‌మార్టం ప్రక్రియ పూర్తయిందన్నారు. అరెస్టైన వారిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నట్లు తెలిపారు. మెయిన్‌పురిలోని ఆశ్రమంలో భోలే బాబా కోసం వెతికినట్లు చెప్పారు. ఆయన పరారీలో ఉన్నారని తెలిపారు. ఆయన ఆచూకీని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

## ఆ బిల్లుల కోసం గుడివాడ గడ్డం గ్యాంగ్ తీవ్ర ప్రయత్నాలు చేసింది: మంత్రి నారా లోకేశ్



గత వైసీపీ పాలనలో గుడివాడలో గడ్డం గ్యాంగ్ ఇష్టానుసారంగా దోపిడీ చేసిందంటూ ఏపీ మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. టిడ్కో ఇళ్లను మంజూరు చేసేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారని, ఆఖరికి టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవంలో నిమ్మకాయ నీళ్ల పేరిట రూ.28 లక్షలు దోచుకున్నారని మండిపడ్డారు. బిల్లుల కోసం గుడివాడ మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ చేశారని, రూ.70 లక్షల విలువైన ఈ బిల్లుల కోసం గడ్డం గ్యాంగ్ తీవ్ర ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. అమృత్ పథకంలో పనులు చేయకుండానే డబ్బులు కొల్లగొట్టారని అన్నారు. జనం సొమ్ము అయితే చాలు... గడ్డం గ్యాంగ్ కు అడ్డు అదుపు ఉండదని, దోచుకోవడమే పని అని నారా లోకేశ్ విమర్శించారు. గడ్డం గ్యాంగ్ దోపిడీకి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమేనని స్పష్టం చేశారు. దోపిడీకి హద్దు లేదా జగన్? ప్రజాధనాన్ని పందికొక్కులా మెక్కడానికి సిగ్గులేదా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## సవాల్ విసిరి... మంత్రి పదవికి రాజీనామా చేసిన రాజస్థాన్ బీజేపీ నేత

**లోక్ సభ ఎన్నికల్లో దౌసా సహా 7 నియోజకవర్గాలకు బాధ్యుడిగా మంత్రి కిరోడీ లాల్**

**ఒక్క నియోజకవర్గంలో బీజేపీ ఓడినా మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్**

**అన్నిచోట్లా ఓడిన బీజేపీ**

**సవాల్ చేసిన మేరకు రాజీనామా సమర్పించిన కిరోడీ లాల్**



రాజస్థాన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత ఒకరు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇచ్చిన మాట మేరకు ఏకంగా మంత్రి పదవికి రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో తన ప్రాంతంలో బీజేపీ ఓడిపోతే తాను రాజీనామా చేస్తానని కిరోడీ లాల్ మీనా సవాల్ చేశారు. ఎక్కువచోట్ల బీజేపీ ఓడిపోవడంతో తాను ఇచ్చిన మాట మేరకు కిరోడీ లాల్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, దౌసా సహా ఏడు లోక్ సభ స్థానాలకు ఆయన బాధ్యుడిగా ఉన్నారు. ఈ ఏడు లోక్ సభ నియోజకవర్గాల్లో ఒక్కచోట బీజేపీ ఓడినా తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. రాజస్థాన్‌లో 25 లోక్ సభ స్థానాలు ఉండగా బీజేపీ 14 చోట్ల మాత్రమే గెలిచింది. అంతేకాదు, కిరోడీ లాల్ బాధ్యుడిగా ఉన్న దౌసా సహా ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. దీంతో తన సవాల్ మేరకు ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన పది రోజుల క్రితమే తన రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మకు పంపించారు.

# భారత క్రికెటర్లకు మహారాష్ట్ర అసెంబ్లీ నుంచి ఆహ్వానం

**అసెంబ్లీకి వెళ్లి సీఎం ఏక్‌నాథ్ షిండేను కలవనున్న ఆ రాష్ట్రానికి చెందిన రోహిత్, సూర్య, దూబే, యశస్వీ**

**జట్టు సభ్యులందరికీ శుక్రవారం విధాన్ భవన్‌లో సన్మానం**

**టీమిండియాకు అభినందనలు తెలుపుతూ మహారాష్ట్ర ఉభయ సభలు ఇప్పటికే తీర్మానాలు**



టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత క్రికెటర్లకు మహారాష్ట్ర అసెంబ్లీ నుంచి ఆహ్వానం అందింది. ఆ రాష్ట్రానికి చెందిన కెప్టెన్ రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, శివం దూబే, యశస్వీ జైస్వాల్ అసెంబ్లీకి వెళ్లి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను కలవనున్నారు. రోహిత్, సూర్య, దూబే, జైస్వాల్ సహా ఇతర జట్టు సభ్యులను శుక్రవారం విధాన్ భవన్‌లో సన్మానించనున్నారు. శివసేన శాసనసభ్యుడు ప్రతాప్ సర్నాయక్ చేసిన ప్రతిపాదనపై స్పీకర్ రాహుల్ నార్వేకర్ స్పందిస్తూ, "ఈ ఆటగాళ్లకు ఆహ్వానాలు వెళ్లాయి. వారు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను కూడా కలుస్తారు" అని అన్నారు. ఇక ఐసీసీ ప్రపంచకప్ గెలుచుకున్న భారత క్రికెట్ జట్టుకు అభినందనలు తెలుపుతూ మహారాష్ట్ర ఉభయ సభలు ఇప్పటికే తీర్మానాలు చేశాయి. ఈ నేపథ్యంలో టీమిండియా క్రికెటర్ల సన్మాన కార్యక్రమానికి శాసనసభ్యులందరూ హాజరయ్యేలా చూడాల్సిందిగా స్పీకర్‌ను అభ్యర్థించనున్నట్లు సర్నాయక్ తెలిపారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్, శివం దూబే, యశస్వి జైస్వాల్ ముంబైకి చెందిన వారని, ఇది ముంబైవాసులకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. 2007, 2011 ప్రపంచకప్‌లు గెలిచినప్పుడు అప్పటి టీమిండియా ప్లేయర్లను ఎలాగైతే సన్మానించారో.. ఇప్పుడు ఈ ఆటగాళ్లను కూడా అదే మాదిరి గౌరవించాలని సర్నాయక్ అన్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ ఆటగాళ్లను వారి అద్భుతమైన ప్రదర్శనకు గౌరవించాలని చెప్పుకొచ్చారు.

# ప్రధాని మోదీకి బీసీసీఐ స్పెషల్ గిఫ్ట్!

**ప్రధాని మోదీని కలిసిన టీ20 వరల్డ్‌కప్ గెలిచిన రోహిత్ సేన**

**ఆటగాళ్లను ప్రత్యేకంగా అభినందించిన ప్రధాని**

**ఈ సందర్భంగా మోదీకి 'నమో' నం. 01 పేరున్న ప్రత్యేక భారత జెర్సీ అందజేత**




2024 టీ20 వరల్డ్‌కప్ గెలిచిన రోహిత్ సేనద ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన టీమిండియా ప్లేయర్లు.. ఉదయం 11 గంటలకు ప్రధాని నివాసంలో మోదీని కలిశారు. ప్రధానితో కలిసి వారు అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మోదీ ప్రతి క్రికెటర్ వద్దకు వెళ్లి అప్యాయంగా పలకరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మోదీకి బీసీసీఐ స్పెషల్ గిఫ్ట్ అందజేసింది. 'నమో' నం. 01 పేరిట ఉన్న ప్రత్యేక టీమిండియా జెర్సీని ఆయనకు అందజేసింది. జట్టు సభ్యుల సమక్షంలో బీసీసీఐ సెక్రటరీ జైషా, అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఈ స్పెషల్ జెర్సీని మోదీకి అందజేశారు. ఇక ప్రధాని మోదీతో భేటీ అనంతరం భారత జట్టు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి ముంబైకి బయల్దేరింది.

# వాంఖెడే స్టేడియంలో టీమిండియాకు సన్మానం...

## మెరైన్ డ్రైవ్ లో అటు అరేబియా సముద్రం, ఇటు జనసముద్రం

ఐసీసీ టీ20 వరల్డ్ కప్-2024 విజేత టీమిండియా ఇవాళ స్వదేశం చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ సాయంత్రం వరల్డ్ కప్ నెగ్గిన టీమిండియా ఆటగాళ్లకు ముంబయిలోని వాంఖెడే స్టేడియంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటగాళ్లకు బీసీసీఐ రూ.125 కోట్ల భారీ నజరానా అందించనుంది. కాగా, తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు వచ్చిన జనంతో ముంబయి మెరైన్ డ్రైవ్ ప్రాంతం క్రిక్కిరిసిపోయింది. అటు అరేబియా సముద్రం, ఇటు జనసముద్రం అన్నట్టుగా ఆ ప్రాంతం అంతా క్రికెట్ అభిమానులతో నిండిపోయింది. మెరైన్ డ్రైవ్ నుంచి ఆటగాళు ప్రత్యేక ఓపెన్ టాప్ బస్సులో వాంఖెడే స్టేడియం వరకు ఊరేగింపుగా వెళ్లనున్నారు. అటు, వాంఖెడే స్టేడియంలోనూ అభిమానులు పోటెత్తారు.





**ఆషికా రంగనాథ్ సింపుల్ గా స్టైలిష్ గా ఉంది**

# సమంత వ్యవహారం అంతా ప్రచారమేనా?

బాలీవుడ్ లో రష్మిక మందన్నా ఏ రేంజ్ లో దూసుకుపోతుందో చెప్పాల్సిన పనిలేదు. పుష్పతో పాన్ ఇండియా మార్కెట్ లోకి అడుగు పెట్టిన తర్వాత 'గుడ్ బై'..'మిషన్ మజ్ను'..'యానిమల్' లాంటి హిందీ చిత్రాలు చేసింది. ప్రస్తుతం 'చావా' లో నటిస్తోంది. ఇటీవలే సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్' లోనూ ఛాన్స్ అందుకుంది. ఇక నేచురల్ పెర్ఫార్మర్ సాయి పల్లవి కూడా నిన్న గాక మొన్న హిందీ మార్కెట్ కి వెళ్లింది. అప్పుడే రెండు సినిమాలు లైన్ లో పెట్టింది.

రణబీర్ కపూర్ సరసన 'రామాయణ్' లో నటిస్తుంది. ఇది పాన్ ఇండియా ప్రాజెక్ట్. దీని కంటే ముందు మరో హిందీ సినిమా కి కమిట్ అయింది. ఆ సినిమానే అమ్మడి బాలీవుడ్ డెబ్యూ అవుతుంది. అదే అమీర్ ఖాన్ తనయుడితో చేస్తోన్న చిత్రం. ఇక కీర్తి సురేష్ అలియాస్ కళావతి గురించి చెప్పాల్సిన పనిలేదు. 'అక్క' అనే ఫేమస్ వెబ్ సిరీస లోఛాన్స్ అందుకుంది. అందులో ప్రియమణితోనూ పోటీకి సై అని ముందుకెళ్లింది. ఇదిగాక ఈరోయిన్ గా 'బేబి జాన్' లో నటిస్తోంది. ఇంకా కొత్త కథలు వింటోంది.

మరి సమంత పరిస్థితి ఏంటి? అంటే పేరు గొప్ప ..ఊరు దిబ్బ అన్నట్లుగానే కనిపిస్తుంది. రెండేళ్ల నుంచి బాలీవుడ్ అంటూ సమంత ఊరేగడం తప్ప ఇంతవరకూ ఒక్క రిలీజ్ కూడా లేదు. ఏ సినిమాకి సైన్ చేసింది లేదు. తాప్సీ బ్యానర్లో ఛాన్స్ అందుకుందని ప్రచారం తప్ప అందులో వాస్తవం తెలియదు. నటించిన 'సీటాడెల్' హిందీ వెర్షన్ కూడా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాలేదు. ఇంకా ఆ హీరో సరనస నటిస్తుంది? ఈ హీరోతో రొమాన్స్ చేస్తుందని? సోషల్ మీడయా కథనాలు తప్ప! ఏ హీరోతోనూ రొమాన్స్ ఇంతవరకూ కన్ఫమ్ కాలేదు. కరణ్‌జోహార్ తో టాక్ షోలు..అక్షయ్ కుమార్ తో డాన్సింగ్ షోలు తప్ప సమంత వాళ్లతో పనిచేసేది ఏమైనా ఉందా? అంటూ సోషల్ మీడియాలోకొత్తగా ఎటాకింగ్ కూడా మొదలైంది.

సమంత ఇంతవరకూ బాలీవుడ్ లో చేసింది 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ తప్ప! మిగతా అంతా మీడియా సృష్టించిన హైప్ గానే కనిపిస్తుందని నెటి జనులు అభిప్రాయపడుతున్నారు. మరి వీటన్నింటికి సమంత ఎప్పుడు? ఫుల్ స్టాప్ పెడుతుందో ? చూడాలి.





**ఆర్టికల్ 370 విజయాన్ని జరుపుకుంటున్న ప్రియమణి యొక్క అందమైన చిత్రాలు**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com